# లెట్ మీ ల(లి)వ్

మేఘం నేలమీద పడుతుందా అన్నట్టు పగలే చీకట్లు కమ్మి సుమారు ఆరు గంటలైంది. వాన ఇంకా తుంపరగా పడుతోంది. గదిలో ట్యూబ్ వెలుగులో నిదానంగా ఏట్స్ కవితా సంకలనం చదువుకంటున్నాడు డాక్టర్ శ్యామ్ బెనర్జీ.

"ఆరయినట్టుంది. నువ్ క్లినిక్‌కు వెళ్ళవూ?" శ్యామ్ కుర్తా గుండీ చేతితో నలుపుతూ అడిగాడు.

సావిత్రి అలా అతను సాలోచనగా ఉండడం చూస్తే ఏదో మైమరపు వచ్చేస్తుంది.

"మీరు.....మీరు....పెళ్ళెందుకు చేసుకోలేదు?" ఎంతో సందేహిస్తూ, భయం భయంగా అడిగింది.

సావిత్రిలోని ఆ సెన్సిబిలిటీయే ఆమెను మానవాతీత వ్యక్తిగా కనిపింప చేస్తుంది శ్యామ్‌కి. ఎంత చనువిచ్చినా, ఎంత చనువుగా ఉన్నా.... రెండోరాత్రి అడిగి ఉండాల్సిన ప్రశ్న....రెండేళ్ళ తరవాత ధైర్యం చిక్క బట్టుకుని అడిగింది సావిత్రి. అందుకే చిన్నవాడూ, చితకవాడూ కాని నలభై ఏళ్ళ శ్యామ్‌కి ఆమె అంటే అంత ఏడోలిసెంట్ ఎడ్మిరేషన్. అంటే పదహారేళ్ళ అబ్బాయికి అమ్మాయిమీద ఉండే ఆరాధ్య భావం.

ఎంత దగ్గరగా వచ్చినా అంత ఎడంగా ఉండగలగడం సావిత్రిలోని ప్రత్యేకత.

ఆమె కళ్లలోకి చూసే ధైర్యంలేక చొక్కా బొత్తాలవంక చూసుకుంటూ ఆమె అప్రశ్నలకు జవాబుగా ఒక వాక్యశకలాన్ని గొణిగాడు శ్యామ్.

-"నీలాంటి భార్య దొరక్క....."

కాసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఇద్దరి తలల్లోనూ ఏవేవో ఆలోచనలు.

హఠాత్తుగా శ్యామ్ మళ్లీ అడిగాడు :

"నువ్ క్లినిక్‌కు బయలుదేరలేదేం?"

"ష్! బాబు నిద్రపోతున్నాడు. ఈ వెదర్‌తో నాకూ రగ్గు కప్పుకుని చూస్తూ పడుకోవాలని ఉంది."

"మరినీ పేషెంట్లో?"

"రేపు చూడొచ్చు."

"నిన్ను చెడ గొట్టేస్తున్నాను. లైక్ సమ్‌టీ?"

"నే చేస్తా!" సావిత్రి లేవబోయింది.

"సర్టెన్లీ నాట్! టీ చెయ్యడం, కప్పులు కడగడంలాంటి క్షుద్రమైన పనులు చెయ్యడంలో నీ అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేయించడానికి నాకు హక్కు లేదు......"

"మరో నాలుగు పద్యాలు చదవగలిగిన ఆ కాలం స్టుపిడ్ టీ కోసం......."

"నువ్వుండు....". బొత్తం నులువుకుంటూ శ్యామ్ వంటగదిలోకి వెళ్ళాడు. రెండు క్షణాల తరవాత సావిత్రే వెళ్లింది వంట గదిలోకి.

•••

వైద్యురాలు సావిత్రీ బెనర్జీతో శ్యామ్ మొదట పరిచయం అనుకోకుండా జరిగింది. వంట్లో బాగులేక ఆ రోజు శ్యామ్ కాలేజీ నుంచి మధ్యాహ్నమే వచ్చేశాడు. ఇంటి కొచ్చాక కడుపులో నొప్పి ఎక్కువై పోయింది. శ్యామ్ క్లాసుకి రాకపోయేసరికి కాలేజీలో విషయం తెలుసుకుని సునీత శ్యామ్ ఇంటి కొచ్చింది. అప్పటికి నాలుగున్నరైపోయింది. శ్యామ్ నొప్పితో చుట్టుకు పోతున్నాడు.

"సరే! నేవెళ్ళి డాక్టరును తీసుకొస్తా!"

"వద్దులే! అదే సర్దుకుంటుంది....."

"ఇంతకు ముందెప్పుడన్నా....."

"లేదు....ఇదిగో ఇక్కడొస్తోంది....మెక్ బర్నీస్ పాయింట్ దగ్గర వస్తే ఎపెండిసైటిస్ అంటారు...ఎనీవే....చాలా నొప్పి"

సునీత గబా గబా మెట్లు దిగి క్రింద వాటాలో ఉన్న ఓనర్స్‌కి చెప్పడం మంచిదని బెల్ కొట్టింది.

"సార్‌కి చాలా కడుపునొప్పి వచ్చేసింది. ఈ దగ్గరలో డాక్టర్....."

బెల్‌విని బయటకు వచ్చిన అమ్మాయి వీధిగేటు వరకూ సునీతను తీసుకెళ్ళి "ఆ నాలుగో ఇంట్లో లేడీ డాక్టరుంది...... డాక్టర్ సావిత్రీ బెనర్జీ..... వెళ్ళి పిలవండి..... చాలా మంచావిడ."

సునీత ఊహించిన దానికంటే ఎక్కువ మాటలే మాటాడింది ఆ పావడాఅమ్మాయి. ఒక్క క్షణం ఆలోచించిది సునీత.

"ఉండండి! నేనూ వస్తా!" లోపలకెళ్ళి వెంటనే వచ్చేసింది.

"శ్యామ్‌గారు పనిచేస్తున్న కాలేజీలో మీరు......" నసిగింది ఆ అమ్మాయి.

ఆయన మా సార్....చాలా బాధపడి పోతున్నారు......"

"అరెరె! మీరు ఏం చదువుతున్నారు?"

"ఎం.ఏ. ఫైనల్...ఇంగ్లీష్ లిటరేచర్......ఈ ఇల్లేనా? ...రె ఇక్కడ బోర్డుందే, నేనెప్పుడూ చూడనే లేదు....".

"తరచు మీరు ఇక్కడికి వస్తుంటారా? నాకు చదువుకోవాలని ఆశ. మా గ్రేండ్ మదర్......

"లోపల కెళదాం....."

నేరుగా డాక్టరమ్మ గదిలోకి జొంబడి పోయింది సునీత. సుబ్బలక్ష్మమ్మా బయటే నుంచుండి పోయింది. చాలా మంది తమ వంతుకోసం కాచి ఉన్నారు.

"క్షమించాలి మేడమ్! డాక్టర్ శ్యామ్ బెనర్జీ చాలా బాధ పడిపోతున్నారు..... ఎపెండి సైటిస్.....చూడటానికే కష్టంగా ఉంది......"

గడగడా ఇంగ్లీషులో చెప్పింది సునీత. బయటనుంచి వింటున్న సుబ్బలక్ష్మి డాక్టరమ్మ ఏమంటుదోనని భయపడుతూ తనూ ద్వారం దగ్గరకు వెళ్లింది.

"ఎం సుబ్బలక్ష్మి నువ్వొచ్చావ్?" సావిత్రి పలకరించింది.

"మా ఇంట్లో అద్దెకుంటున్నాయనా"

"ఆయనే డాక్టర్ శ్యామ్ బెనర్జీ....."

"బయట నేమ్ ప్లేట్ ఏమీ లేదే, ఎన్నాళ్ళయి ప్రాక్టీసు చేస్తున్నారు?"

"ఆయన డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ..... పి.హెచ్.డీ. ఇన్ ఇంగ్లీష్ లిటరేచర్..... ప్లీజ్! తొందరగా రారూ?"

"ఏం సుబ్బలక్ష్మి అంత బాధపడుతున్నారా?"

"నేను చూడలేదు....ఈఅమ్మాయి....."

"సరే పదండి......"

- మేడమెట్లెక్కి అయాసపడుతూనే నాలుగు పక్కలా కలియ చూసింది సావిత్రి....ముందు గదిలో సోఫా సెట్టూ, మధ్య టీ పాయ్‌మీద ఏవో పేపర్లు పుస్తకాలూ..... మధ్య గదిలో చిందర వందరగా బట్టలూ, జోళ్లూ....లోపల గదిలో మంచం మీద మూలుగుతున్న పేషెంటూ.....

- "సారీ మేడమ్! మా సార్ ఏదీ పట్టించుకోరు....ఎ రియల్ ఇంటలెక్చువల్!"

"దట్సాల్ రైట్!"

"ఎవరదీ?" శ్యామ్ మెల్లగా కళ్ళు విప్పాడు.

"సార్ డాక్టర్‌ని తీసుకొచ్చా!"

"హలో డాక్టర్! నొప్పి ఎపెండిసైటిస్ అనుకుంటా!"

"మీకు నొప్పి తగ్గినట్టుందే!"

"కాబట్టే మాటాడుతున్నాను.....మళ్ళీ వస్తుందేమో...... మనిషి జీవితంలో సుఖం లాంటిదీ నొప్పి - ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు....సారీ, కూచోండి!"

"సర్!" డాక్టర్ సావిత్రి వంక చూసి సునీత కలగచేసుకోబోయింది.

"నెవర్ మైండ్‌మీ! ఐ ఎపాలజైజ్....అబ్బ! మళ్ళీ నొప్పి.....స్... ఇక్కడ .......ఈ పాయింట్......దీన్ని.....సారీ, మరిచి పోయాను......"

"డోన్ట్‌వర్రీ....... నన్ను చూడనివ్వండి......తల అటుతిప్పండి........"

డాక్టర్ సావిత్రి తన పరీక్ష ప్రారంభించింది. రెండు నిముషాల తరువాత సునీతతో చెప్పింది. "మీ సర్ అనుకున్నదేం కాదు. సివియర్ గాస్ట్రిక్ అప్‌సెట్...ఈ మందులు వాడండి....ఏదీ అమ్మాయి ఆ కాగితం......"

- టేబిల్ మీద శ్యామ్ లెటర్ ప్యాడ్ తీసి ఇచ్చింది సునీత.

సావిత్రి ప్యాడ్ వంక చూస్తూ ఓ క్షణం అలా ఉండిపోయింది.

"మేడమ్!"

".....ముందు ఈ ఇంజక్షన్ తీసుకురా...... నాక్లినిక్‌లో ఉంటుంది, క్విక్......"

- సావిత్రి ముఖంలోని ఎరుపు చూసి 'నేనెళతా!' అంది సుబ్బలక్ష్మి.

"ఏదీ, నోరు తెరవండి....మింగండి......"

కిట్ బ్యాగ్‌లో నుంచి ఓ మాత్రతీసి వేసి కుర్చీలో కూచుంది సావిత్రి.

"ఈయన ఇక్కడికి వచ్చి ఎన్నాళ్ళయింది?" సునీత నడిగింది సావిత్రి.

"హైదరాబాదు వొచ్చి రెండేళ్ళయింది ఈ ఇంటిలోకి వచ్చి కొన్ని నెలలే అయింది.... ఉస్మానియాలో రీడర్......"

"ఈయన కెవరూ లేరా?"

"లేరనే చెబుతుంటారు. నేను మొదటి సారి అడిగిన తరువాత ఎందుకు అడిగానాఅని నొచ్చుకున్నాను. మంచికి మారుపేరు మా శ్యామ్‌సర్.....నేనే కాదు మాక్లాసంతా అంతే....అందరం ఆయిన్ని లైక్ చేస్తాం.. ఆయనను రోజుకోసారి చూడాలి. ఎట్ లీస్ట్ నేను ఆయన్ను చూడకుండా ఉండలేను."

"సరే, నేను ఇంజక్షన్ ఇచ్చి వెళతా! మళ్ళీ రాత్రిఇంటికి వెళుతూ వచ్చిచూస్తా."

"మీరు వచ్చేవరకూ నేను ఉంటా.....మీరు వచ్చి చూశాక టాక్సీలో మా ఇంటికి తీసుకుని వెళతా!"

"అది మీ ఇష్టం, కాని ఆందోళన పడవలసిన కేసేమీ కాదు."

- ఇలా ప్రారంభమైంది సావిత్రికి శ్యామ్‌తో పరిచయం. మరో రెండురోజుల తరవాత సావిత్రి క్లినిక్‌లో ఉండగా శ్యామ్ కార్డు లోపలకు తెచ్చింది ఆయా.

కార్డువంక చూస్తూ ఆలా ఉండిపోయింది. సావిత్రి. పావుగంట తరువాత తేరుకుని. "డాక్టర్ బెనర్జీగారిని లోపలకుపంపు". అంది.

"క్షమించాలి....ఆ రోజు నామాటలతో ప్రమేయం లేకుండా సునీత కార్లో ఇంటికి తీసుకు వెళ్ళిపోయింది."

మీరు తెలుగు చాలా స్వచ్ఛంగా మాటాడతారే!

"మావాళ్ళు నాకు ముద్దుకి బెనర్జీ పేరు పెట్టారు. సగటు ఆంధ్రుడి లక్షణాలన్నిటినీ పోగొట్టుకున్నా నా ఉచ్చారణ ఒక్కటే మిగుల్చుకో గిలిగాను."

"అంటే మీరు తెలుగు వాళ్ళే నన్న మాట!"

"అవును. మీరూ తెలుగువాళ్ళ ఆడబిడ్డే నన్న విషయం నాకు తెలుసు".

"ఏలా?"

"ప్రశ్నించడం నాకూ తెలుసు........ సునీత చెప్పింది. సునీతకి సుబ్బలక్ష్మి చెప్పిందట.....మీ ఫీజు........?"

ప్యాడ్ మీద ఏదో రాసి ఇచ్చింది సావిత్రి. కాగితం చూసి అలా ఉండి పోయాడు. ఒక్క క్షణం ఆగి సావిత్రి ముఖం లోకి చూశాడు. తెలుగు వాళ్ల ఆడబిడ్డ......ముఖాన బొట్టులేదు. లెటర్ ప్యాడ్ మీద బిల్లు మొత్తం నలబైఐదు పైసలు..... మీద గోల్డ్ స్పాట్ రంగు అక్షరాలు- డాక్టర్ సావిత్రి భెనర్జీ ఎం.డి.

"భిల్లు నలభై ఐదు పైసలా?"

"రెండు మాత్రలు ముప్పై ఐదు పైసలు. డిస్టిల్డ్ వాటర్ ....పదిహేను పైసలు.... ఎమర్జన్సీలో యాక్చువల్స్‌కి మాత్రమే చార్జిచేస్తా సునీత ఎమర్జన్సీ అనే చెప్పింది. మీరూ అదే అనుకున్నారు. కదూ!" నవ్వుతూ అంది సావిత్రి.

ఆ నవ్వులో ఆనందం లేదు - నిర్లిప్తత లేదు. ఉత్సాహం లేదు. సామాన్యంగా నవ్వులో స్ఫురించే భావమేమీ లేదు.

"సునీత ఈజ్ ఎ సిల్లీ గర్ల్!........ఇన్ ఫ్యాక్ట్ సో యామ్ ఐ......ఐయామ్ సారీ."

-“ మమ్మీ, ఎవరీయన?”

శ్యామ్ చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు. అయిదేళ్ల అబ్బాయి. బొద్దుగా, ఎర్ర గా, ముద్దుగా ఉన్నాడు.....

“బాబీ, అప్పుడే వచ్చేశావా?”

“ఎవరు మమ్మీ ఈయన....?”

“శ్యామ్ బెనర్జీ!”

“డాడీ?!...”

“అవును!”

- సావిత్రి కుర్చీలో గోడవంక తిరిగి పోయింది.

“ఇన్నాళ్ళు నన్ను చూడకుండా ఎందుకున్నారు.....స్కూల్లో.....అందరి డేడీలూ రోజు వచ్చి పిల్లల్ని డ్రాప్ చేస్తారు.....మీరు ఎక్కడికెళ్ళి పోయారు.....”

బాబీ శ్యామ్ దగ్గర కొచ్చేశాడు.

సావిత్రి వంక చూడలేదు శ్యామ్.

“సారీ! బాబీ......”

“ఇంటికెళ్ళిపోదాం........” చెయ్యి పట్టుకులాగాడు......

శ్యామ్ వెనక్కి తిరిగి చూడకుండా బాబీతో వెళ్ళిపోయాడు.

●●●

“మనం కావాలనుకున్న దాన్ని పొందలేం. దేన్ని విడనాడమని శపథంచేస్తామో, దేన్ని ప్రాణ పదిలంగా దాచుకోవాలనుకుంటామో దానిని దాచుకోలేం కూడా! మన నిశ్చయం మనది కాదు....” సావిత్రి నిట్టూర్చింది.

“చాలా వేదాంతిలా మాటాడుతున్నావ్!” లావణ్య శ్యామ్‌వంక చూస్తూ చిరునవ్వుతో అంది.

“ఇలా మాటాడినంత మాత్రాన వేదాంతిగా అంగీకరిస్తే మీరు చాలామందిని వేదాంతులనవలసి వస్తుంది.” శ్యామ్ లావణ్యవంకే చూస్తూ అన్నాడు.

“కాని.....దేవుడున్నాడు. మన మంచి చెడులకీ మనకివచ్చే సుఖదుఃఖాలకీ కోరిలేషన్ వుంది......ఉదాహరణకి.....”

“ఉదాహరణలు నేను ఏనసు. దేవుడు లేడనీ నేనను........ దేవుడు బఫూన్ అని శ్యామ్ అంటూ ఉంటారు......బఫూన్ తను గంతు వేసి నవ్విస్తాడు. కాని దేవుడు మనల్ని పల్టీ కొట్టించి తను నవ్వుకుంటాడు.....కాబట్టి అరటి తొక్కమీద కాలుజారి పడినా నవ్వడం నేర్చుకోవాలంటారు శ్యామ్!”

“రైట్ నువ్వేమంటావో తెలుసుకుందామనే అలా అన్నాను....దేవుడు లేడు...... నువ్ చేసే దానికి నీకు వచ్చే కష్టసుఖాలకీ కోరిలేషన్ లేదు...”. - లావణ్య వాదించడానికి ముందుకొచ్చింది”. దేవుడి లీలంటే చీకటిలో చిందులాటలన్నమాట! మనకి అర్థం కానివన్నీ దేవుడే చేశాడనుకోడం వెర్రితనం. దేవుడులేడు.... లేడు.......లేడు....... నువ్ ఎంత పందెం వెయ్యమంటే అంతా వేస్తాను......నిన్ను దేవుడిని చూపించ మని అడుగుతానని భయపడకు......లేని వాడిని నువ్వెలా చూపించగలవ్?”

"దేవుడు ఉన్నాడని నే పందెం వెయ్యలేదనేగా నీ పందెం! లావణ్యా చూపించడం అసాధ్యమైనా చూడడం సాధ్యమే! మనసును తగు విధంగా కేంద్రీకరిస్తే....మీరే మంటారు శ్యామ్?" సావిత్రి అడిగింది.

"ఓ తత్త్వవేత్త మాటలు గుర్తుకొస్తున్నాయి...... మహామంచి దేమిటంటే అసలు పందెం వెయ్యకపోవటమే!"

"అదే పలాయనతత్వం!" లావణ్య ముఖం ఎర్రగా అయింది.

"నేను పలాయన వాదినికాను. దేవుడి గురించి తెలుసుకోలేమని మాత్రం చెప్ప గలను. సావిత్రిగారన్న కేంద్రీకరణని సాధ్యపరచేదీ దేవుడేమోనని నాఉద్దేశ్యం."

"మీకు దేవుడంటే భయమా?"

"దేవుడికి భయపడాల్సిన పాపం చెయ్యలేదు నేనెప్పుడూ!"

"మీ మాటల్లో దేవుడిమీద నమ్మకం కంటే భయమే కనపడుతోంది.... దేవుడు లేడన్న నమ్మకం....దేవుడు లేడనడానికి నిదర్శనం.....మన కళ్ళముందున్న సావిత్రి కంటే ఇంకెవరు కావాలి చెప్పండి.........శ్యామ్ బెనర్జీని మనసారా ప్రేమించింది పెద్దవాళ్లు వద్దంటున్నా పెళ్ళిచేసుకుంది. జస్ట్ కన్ను మూసి తెరిచేలోగా విమానంలో పాటు బొగ్గయి పోయాడన్న ఒక్కటే వార్త...ఈ శిక్ష అనుభవించడానికి సావిత్రి చేసిన పాపం ఏమిటి? దేవుడు బఫూన్ కాదు విలన్- ఎవరైనా సంతోసంగా ఉంటే కంటిలో నలక పడ్డట్టు ఫీలయ్యే వ్యక్తి...... సాడిస్ట్....."

"పోన్లేవే! నా అదృష్టం అంతే! రాక రాక వచ్చావ్....సంతోషంగా....."

"నేను మనిషినే సావిత్రీ! భగవంతుడికి నువ్వేం అన్యాయం చేశావని, నీకీ శిక్ష?" లావణ్య ఉద్రేక పడింది.

"యాదృచ్ఛికానికీ, ప్రారబ్ధానికీ ముడి పెట్టాలనుకుని దేవుడిని దుయ్యబట్టడంలో ఏం ప్రయోజనం ఉంది?.......ఇప్పుడు నా గుండె చూడండి ఎంత ఉద్రేకంతో స్పందిస్తుందో! ఇద్దరూ డాక్టర్లు కదా! ఛాలెంజీ! నా గుండె చూసి నేను ఉద్రేక పడుతున్నాని చెప్పండి!"

"ఓయస్!" స్టెత్ పట్టుకుని లావణ్య ముందు కొచ్చింది.

"ఎంత సేపు చూస్తారు?" నవ్వుతూ అడిగాడు శ్యామ్.

"వన్ మినిట్ ఆర్ లెస్! ఆ.....చొక్కా విప్పండి......"

"వన్ మినిట్ అప్!".....సావిత్రి గడియారం చూస్తూ అంది.

"ష్!"

"ఏమిటే అలా?..."

"సావిత్రీ మీరు ఇప్పుడు మీ స్నేహితురాలిని పరీక్షించండి! ఇంక మీరూ మీరూ చూసుకోండి.....సగం రాసిన పద్యం ఒకటుంది. దాన్ని పూర్తి చెయ్యడానికిదే అవకాశం......" శ్యామ్ వెళ్ళిపోయాడు.

"ఏమిటే అలా ఉన్నావ్?" సావిత్రి అడిగింది లావణ్యని.

"తీరికగా మాటాడుకుందాం!" లావణ్య స్టెత్ డయాఫ్రమ్ మీద చూపుడు వేలుతో కొడుతూ ఏదో ఆలోచనలో పడింది.

"ఏమిటి నిన్ను చూస్తే నాకుభయం వేస్తోంది......"

"నాకూ భయమే వేస్తోంది.....శ్యామ్‌ని నువ్ ప్రేమిస్తున్నావా? అఫ్‌కోర్స్ ఎ స్టుపిడ్ క్వెశ్చెన్! బట్ స్టిల్......"

"ఆయనతో పరిచయమైన దగ్గరనుంచీ బాబీ తనకు తండ్రి అతనే అనుకుంటున్నాడు......."

"నువ్వు అతనే నీభర్త అనుకుంటున్నావ్.....ఐకుడ్ సీదట్!" నిట్టూర్చింది డాక్టర్ లావణ్య.

●●●

"శ్యామ్! ....కేవలం ఆట కోసం..... మీకు ఎలా చెప్పాలో తెలియడంలేదు...."సావిత్రి నసుగుతూ అంది.

"ప్రొఫెషనల్ ఛాలెంజన్నమాట........"

"పెర్సనల్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఉన్నప్పుడు........."

"ఐ కెన్ టేక్ ఇట్. చెప్పు - నువ్ చెప్పబోయేది నాకు తెలియకపోతే కదా- షాక్ అయిపోను......"

"యువర్ హార్ట్! నా ఫ్రెండ్ లావణ్య పేరు మోసిన కార్డియాలజిస్ట్.....ఆలస్యం చెయ్యకుండా ఆపరేషన్ చేస్తానంది. తనతో పాటే న్యూయార్క్ వచ్చెయ్యమంటోంది మన అందరినీ! మీకేం భయంలేదు.....మీ ప్రాణానికి తన ప్రాణం హామీ ఇస్తుందట......"

"సారీ! నువ్ ఒక్క బిగిన మాటాడేస్తున్నావ్! కంగారుపడిపోకు.....నా గుండె లోని లొసుగు నాకు తెలియనిది కాదు....... కాని నేను అది ఏ నాడో మరచిపోయాను. అందుకే ఆరోగ్యంగా ఉండగలుగుతున్నానేమో!. డాక్టర్లు వ్యాధి పేరు తెలిసీ తెలియగానే కంగారు పడిపోతారు......వాళ్ల చాకచక్యం మీద వాళ్లకి నమ్మకం ఉండదేమో!"

"డస్సిపోయిన నా జీవితంలోకి వెలుగు తీసుకొచ్చారు.....బాబీకి మీరంటే ప్రాణం. మమ్మల్ని అన్యాయం చెయ్యకండి.....మీరు కాదనకండి.....అందరం లావణ్యతోపాటే వెళదాం......." సావిత్రి ఆత్రుతగా శ్యామ్ కళ్ళలోకి చూసింది.

"సావిత్రీ! డాక్టరుకు కావాల్సిన ధైర్యం నీలో......"

"శ్యామ్! నేను డాక్టర్నని ఎందుకు ఆటపట్టిస్తావ్......నేను మామూలు మనిషిని. సర్వస్వం పోగొట్టుకుని పోగొట్టుకుని, మళ్ళీ పోగొట్టు కుంటానని భీతిల్లి పోతున్న ఓ సాధారణమైన ఆడదాన్ని."

"సావీ! నీ ఆరాటం తెలియనిది కాదు కాని ఆఆరాటం....నా జీవితంలో ఎప్పుడో మోడై పోయిందనుకున్నా...... ఏ జీవితం లోనూ అంతా వసంతమే ఉండదు.....అనుకోని, ఎదురుచూడని వసంతం ఆ జోకర్ నా కిచ్చి నా తత్త్వాన్నే మార్చేశాడు.... కాని అతను జోకర్....అతన్ని నమ్మడానికి వీల్లేదు.....ఈ ఆనందాన్ని నమ్మడం తెలివి తక్కువతనం.......హి ఈజ్ ఫన్నీ......డిసీట్ ఫుల్.....నిన్ను నాకు ఇచ్చాడు......నన్ను నీ దగ్గరనుండి తీసుకుపోతాడేమో! ......సారీ! నేను అసలు ఈ జోక్ వెయ్యకుండా ఉండాల్సింది...... భగవంతుడు జోకరని తీసి పారేయడంలో ఏ మాత్రం తొణకడం లేదని నా గుండె చూచుకోమన్నాను........ ఆమె అంత పెద్ద డాక్టరని నాకు తెలియక అన్నాను.....నాలోగల విషయం నేనూ ఏనాడో మరచిపోయాను....."

"శ్యామ్! మీ మనో ధైర్యానికి జోహార్లు........"

"ఉండు సావిత్రీ.......ఏ నిర్ణయాన్నీ ఫోర్స్ చేస్తే ఆ తరువాత వచ్చే చీకటి.....మరొక మాట. నేను చాలా మెల్లగా చదువుతాను. ఐయామ్ స్లో.....ఆల్వేస్ స్లో...... నేనూ సునీతా డాంటే చదువుతున్నాం...... సునీత పారడైజ్‌లో ఉంది..... నేనింకా పర్గెటోరియోలోనే ఉన్నాను. థాంక్‌గాడ్ ఇద్దరం ఇన్ ఫెర్నో దాటాం!" కులాసాగా నవ్వాడు శ్యామ్.

"అవన్నీ నాకు తెలియవ్! ఇక హాస్యం చాలు. వైద్యానికి మీరు సిద్ధపడాల్సిందే!"

"ఆ తరువాత వచ్చే పరిణామాలకు......."

"మీకు హాస్యం కంటె వేరేమీ అర్థం కావా? మరేదీ జీవితంలో మీకు కపడదా?"

"దాన్నే చూడగలుగుతున్నానుకాబట్టి, నెగ్గుకొస్తున్నాను. సావీ, ఒక్క మాట అడుగుతాను చెప్పు. ఇది హాస్యం కాదు.....ఐయామ్ డెడ్ సీరియస్! నువ్ నన్ను ఎందుకింత ప్రేమిస్తున్నావ్! నాలో ఏ ముందనీ నేను నీ ప్రేమకు అర్హుడినేనా?"

"చెబుతానండి నాకోసం నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను. నాభర్త చనిపోయాక ఇంకొకరిని ప్రేమించలేనని అనుకున్నాను. కాని మీరన్నదే నిజం.....అతనో జోకర్........ఆ జోకర్ నాలోని మార్పుకి కారకుడు.....నా మీద ప్రేమతో, అనురాగంతో నాలోని మార్పునికలిగించింది మీ జోకరే?"

"సరే చావుకి నే భయపడను. ఇంత వరకూ జీవించడానికి భయపడిన మాట వాస్తవమే! ఒక్క షరతుమీద విమానం ఎక్కేస్తాను........"

"ఏ షరతైనా నేను సిద్ధమేనని మీకూ తెలుసు......."

"అంత మొండి ధైర్యం నాకు లేదు. నేను పిరికి వాడిని......"

"పిచ్చి శ్యామ్! మీ షరతేమిటి?"

"ఆపరేషన్ అయిన నెలకే నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

"ఇప్పుడెందుకు చేసుకోకూడదు?"

"నాకు ఆ జోకర్‌మీద నమ్మకం లేదు. ఒకసారి నిన్ను మోసం చేశాడు. ఇంకో సారి చెయ్యడన్న ధైర్యం నాకు లేదు"

"దేవుడి సంగతి నాకు తెలియదు కాని, లావణ్య జోకర్ కాదు....అట్లాంటి వాళ్ల అద్భుత కృత్యాలు విన్నంత మాత్రాన ఎంత నమ్మకం లేని వాళ్ళకైనా డాక్టర్లంటే నమ్మకం కలిగి తీరుతుంది."

"నాకు మనిషిలో ఉన్న విశ్వాసం భగవంతుడి మీద లేదు.....కాని ఒక సంగతిమరిచి పోను.....నేను ఆపరేషన్ టేబిల్ మీదకు వెళ్ళే వరకూ నీకు శాంతి ఉండదు.....వెళ్ళితే నిన్ను పోగొట్టు కుంటానేమో నన్న భయంకంటే, నీకేం అన్యాయం జరిగి పోతుందోనన్న భయమే ఎక్కువ....... చావంటే నాకు భయంలేదు......నిన్ను పోగొట్టుకోవడమంటేనే......"

"ఏమిటిశ్యామ్ ఆ మాటలు ......ఇల్లాంటి ఆపరేషన్లు లావణ్య రోజుకి రెండు చేస్తుంది......"

"సరే......నాకు ఊపిరినిచ్చిందీ దేశం......పోనీ ఎక్కడయితేనేం? అక్కడయితే నాకు ఈ మాత్రం తెలిసిన వాళ్ళుండరు. అక్కడి వాళ్లు పోనీ ఒకడైనా తగ్గాడు అనుకుంటారు, తృప్తిగా....నీ కన్నీళ్ళు తుడిచేశక్తి నాకుంటే బాగుండును.....నీ శాంతిని నీకు దూరం చేసే హక్కు నాకు లేదు.......ఇక్కడ ప్రజల సూటి పోటీమాటలైనా తప్పుతాయి కొన్నాళ్ళు......"

"అవన్నీ పట్టించు కుంటున్నారా?..... మన వయసునైనా దృష్టిలో పెట్టుకోరు మూర్ఖులు......"

"డాక్టర్లకీ, టీచర్లకీ సత్ప్రవర్తన కావాలనుకునే ప్రజలు....మనం రాజకీయ నాయకులమో, వ్యాపారస్తులమో అయితే....."

"నేను తల్లిని కూడా!"

"మనలో నిజాయితీ ఉంది.....మనం ఆత్మ సాక్షిగా బ్రతుకుతున్నాం. అది సామాన్యమైన విషయ మేమికాదు." చొక్కా బొత్తం నులుపుకుంటూ శ్యామ్ అన్నాడు ఆమె కళ్లలోకి చూస్తూ.

"రచయితలా మాటాడుతున్నారు!"

"నాలో ఆలోచనలకి పదును పెడుతున్నావ్! నువ్ నాతో ఉంటే నా ఆలోచనలన్నీ అక్షర రూపం తెచ్చుకుంటాయి...... ఆ రోజు నేను బాధతో మెలితిరిగి పోతున్నప్పటి నా బాధ నువ్ ఊహించగలవా?"

"ఏదేం పెద్ద జబ్బు కాదుకాని ఆ బాధను మాత్రం ఊహించగలను......"

"సరే అదే నాకు కావలసింది. ఆ బాధ కంటె నిన్ను పోగొట్టుకుంటానేమో నన్న భయం ఇంకా చాలా బాధ కలిగిస్తోంది."

ఆమె చేతిని చేతిలోకి తీసుకున్నాడతను.

"నువ్వు నన్ను పోగొట్టుకుంటానేమో నన్న భయానికి లోనవడంలేదూ?"

"లేదు.....నా ప్రాక్టీసు మానేస్తాను..... ఉన్న ఆదాయంతో......"

"వద్దు వద్దు- నాకు బీదరికం అంటే అసహ్యం, ఘోరమైన భయం. బీదవాళ్లను చూస్తే నాకు కంపరం పుట్టుకొస్తుంది......"

-" వాళ్లకి సేవ చెయ్యడంలో నాకు ఆనందమే కలిగింది...."

-" నువ్వు బీదరికాన్ని ఎరగవు.....బీదరికాన్ని చూడడం, జాలి పడడంవేరు, దాన్ని అనుభవించడంవేరు.....నా గతం నీకు తెలీదు నావిత్రీ....నేను అనుభవించిన బీదరికం భయంకరమైనది.....అప్పుడు నాకు పధ్నాలుగేళ్ళుంటాయేమో! ఒకావిడ నన్ను రక్షించింది. ఆవిడ నన్ను చూసిన క్షణం నుంచీ డబ్బుకి ఏలోటూ లేకపోయింది. నా అవసరాలూ ఎక్కువ ఖరీదైనవి కావని నీకు తెలుసు....."

"ఎవరావిడ?"

"ఆవిడ నాలో ఏం చూసిందో, ఎందుకు జాలిపడిందో ఎందుకంత ఆత్మీయత చూపించిందో నాకు తెలియదు.... ఆవిడా నా కంటే ఓనాలుగేళ్ళు వయసులో పెద్దది...."

"మరేం అడగను....."

"ఆవిడ మరి లేదు...."

"ఐయామ్ సారీ!"

"జీవితంలో చేదు భరించడం తప్పదని అందరూ వాపోతుంటారు....చేదునీ ఆర్ద్రతతో స్వీకరించడం అలవాటు చేసుకున్నాను......కాని....".

"చేదుని పెంచడానికి భయపడుతున్నారు.....మీరు కలకాలం నా వాళ్లుగా ఉండాలని నా ఆశ....మీరు నాకు అన్యాయం చెయ్యరు- దేవుడూ నాకు న్యాయమే చేస్తాడు....మీరు లేకపోతే నేను

బ్రతకలేను......"

"అందుకే......"

"మీకు డాక్టర్ల మీద నమ్మకంలేదు."

"డాక్టర్స్‌ని ఫూల్స్ చేస్తూనే నేనిలా బ్రతుక్కంటూ వస్తున్నాను సావిత్రీ....."

"అలా అనుకుంటున్నారు...."

"కాదు.....ఐయామ్ బిట్టర్ విత్ దెమ్ నాకు గుండె జబ్బుందన్నారు... ఆమె చచ్చి పోయింది......వాట్ ఎ బిట్టర్ జోక్! ఐ వాన్ట్ టు బి లెఫ్ట్ ఎలోన్! నువ్ నాకోసం ఏమైనా చేస్తావని తెలుసు....దయచేసి నీ స్నేహితురాలితో చెప్పు - మానాన నన్ను వదిలెయ్యమని."

"అది అంత సులువుకాదు శ్యామ్..... నన్ను చంపేస్తుంది. చేజేతులా చేతి కందిన అమృత కలశాన్ని విరగ్గొట్టుకుంటున్నానంటోంది....."

"నువ్వు ఆడదానివి....డాక్టర్ల మీదంటే నాకు నమ్మకం పోయింది. ఆడదానివల్లే ప్రపంచమంతా వెలుతురు రావాలి. ఆడదాని వల్లే జీవితంలో సుఖం, శాంతి, ఆనందం.......నువ్వు స్త్రీవి. అమృత మూర్తివి-గాయపరచకుండా ఆమెను ఇక్కడ నుంచి పంపెయ్....."

"ఆమె మాటను కాదని ఆమెని నొప్పించకుండా ఉండలేను...."

"సరే.....నేను ఆపరేషన్‌కి సిద్ధమేనని చెప్పు....అవిడదే ఆలస్యం. రేపు బయలు దేరమన్నా నేను సిద్ధమే!"

"చాలు శ్యామ్! నామీద నీకు అంతటి అనురాగం ఉందని నాకు తెలుసు.... స్వీట్ శ్యామ్....ఐ లవ్‌యూ! గ్రేట్ శ్యామ్ ఐ ఎడోర్ యూ!"

- "సారీ వే!" డాక్టర్ లావణ్య వచ్చింది గదిలోకి. సావిత్రీ, శ్యామ్ విడిపోయారు.

"మిమ్మల్ని చూస్తే నాకు భలే జలసీగా ఉంది......పదహారేళ్ళ వయసులో ఉన్నారు మీరింకా......దట్ ఈజ్ గ్రేట్!"

"లవ్ ఈజ్ వండర్‌ఫుల్!" శ్యామ్ ఓ ప్రవచనంచేసే ధోరణిలో అన్నాడు.

డాక్టరు లావణ్య ముఖంలోని సంతోషం, ఆమె మాటల్లోని హుషారు ఆమె నవ్వులోని ఆనందం అన్నీ బోలుగా, వెలితిగా కనపడుతున్నాయి శ్యామ్‌కి....స్నేహితురాళ్ళిద్దరూ ప్రపంచంలో వారిద్దరే ఆనందంగా ఉన్నట్లు గర్వపడిపోతున్నారు.....

ఎయిర్‌పోర్ట్‌లో విమానం ఎక్కేముందు చివరి ఘట్టంలోకి వెళ్ళబోతోంది డాక్టర్ లావణ్య.

గుడ్‌బై శ్యామ్.....ఇది మార్చి.....జూన్‌కి అన్ని సిద్ధంచేసి ఉంచుతా.....నాలుగు నెలలుండేటట్టు రావాలి......పాపాయిని నే చూసుకుంటా......

"యూ ఆర్ వండర్‌ఫుల్......ఆమె చెయ్యి నొక్కుతూచెప్పాడు శ్యామ్.

"బాబీ!" అంటూ పిలిచేసరికి బాబీ లావణ్యను కావలించేసుకున్నాడు.

-బ్యాక్ సీటులో మోకాళ్ళ మీద నుంచుని వెనక అద్దంలోంచి ప్రపంచాన్ని చూస్తున్నాడు బాబీ....సావిత్రి కారు డ్రైవ్ చేస్తోంది....

"పాపాయి సంగతి నాతో చెప్పనేలేదే?"

శ్యామ్ అడిగాడు. ఎదురుగా పూర్ణ కలశంలో ఊరేగింపు వస్తోంది. కారు స్లోచేసి లెఫ్టకి తీసి ఆపింది సావిత్రి....

"పాపాయి సంగతి.....?"

"అందమైన అబద్ధం....." ఊరేగింపు వంక తదేకంగా చూస్తూ అంది సావిత్రి.

ఆమె గొంతులో నుంచి శ్యామ్ భయపడిన నిట్టూర్పు వినపడలేదు....ఆమె మాటలో అంతా ఆనందమే....అంతా తియ్యదనమే తొణికిసలాడింది.

-శ్యామ్ దృష్టి పూర్ణకలశం మీదనే ఉంది.

జ్యోతి, ఫిబ్రవరి, 82